జీపీ భవనాలు పూర్తయ్యేనా?

- అద్దె భవనాల్లో కొనసాగుతున్న సేవలు
- ఇబ్బందులు పడుతున్న పంచాయతీ అధికారులు, గ్రామస్తులు


చిన్న టాక్లీలో సగంలో నిలిచిపోయిన గ్రామ పంచాయతీ భవనం

మద్నూర్(జుక్కల్): గతంలో ఉన్న ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీలకు భవనాలు నిర్మించాలని శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించినా ముందుకు సాగలేదు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పరిపాలనా సౌలభ్యం కోసం నూతన గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసినా ఇంత వరకు వాటికి భవనాలు లేక సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది మద్నూర్, డోంగ్లీ మండలాల్లో ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీ భవనాలను నిర్మించాలని పనులు మొదలుపెట్టినా కొన్ని ఇంత వరకు పూర్తి కాలేదు. మరికొన్ని అసలుకే పనులు మొదలు పెట్టలేదు. మద్నూర్, డోంగ్లీ రెండు మండలాల్లో మొత్తం ఏడు నూతన గ్రామ పంచాయతీలకు భవనాలు మంజూరయ్యాయి. ఒక్కో పంచాయతీ భవనానికి ప్రభుత్వం రూ.20 లక్షల నిధులు కేటాయించింది. ఇందులో సోమూర్, చిన్న టాక్లీ, ఇలేగావ్, మారెపల్లి గ్రామాల్లోని పంచాయతీ భవనాలు నిర్మాణ దశలో ఉండగా చిన్న ఎక్లార, చిన్న తడ్గూర్, సిర్పూర్ గ్రామాల్లోని పంచాయతీ భవన నిర్మాణ పనులు అసలుకే ప్రారంభం కాలేదంటే గత ప్రభుత్వం పనితీరు అర్థమవుతోంది. డోంగ్లీ మండలంలోని సిర్పూర్ గ్రామం జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ సొంతూరు కావడం గమనార్హం. గ్రామ పంచాయతీకి భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో అరకొర వసతుల నడుమ పంచాయతీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, నూతన ప్రభుత్వం స్పందించి గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరగా పనులు ప్రారంభించాలి

గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలి. గ్రామంలో పంచాయతీకి భవనం లేకపోవడంతో అద్దె భవనంలో కొనసాగుతోంది. దీంతో సామగ్రిని, ముఖ్యమైన డాక్యుమెంట్లను భద్రపరచడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు, ప్రభుత్వం స్పందించి త్వరగా చర్యలు తీసుకోవాలి.

– శంకర్, గ్రామస్తుడు, సిర్పూర్

ఉన్నతాధికారులకు తెలియజేశాం

పనులు జరిగిన వరకు మాత్రం బిల్లులు చేసి ఉన్నతాధికారులకు పరిస్థితిని తెలియజేశాం. మొత్తం ఏడింటిలో నాలుగు నిర్మాణ దశలో ఉండగా మూడు పంచాయతీ భవనాలు ఇంకా ప్రారంభం కాలేదు. చిన్న తడ్గూర్, చిన్న ఎక్లార, సిర్పూర్‌లలో పనులు చేపట్టడానికి ఎవరు ముందుకు రాకపోవడంతో పనులు ఇంకా ప్రారంభం కాలేదు.

– మధుసూదన్, ఏఈ, పంచాయతీరాజ్ శాఖ

రైల్వేలైన్ తీసుకురాలేని అసమర్థుడు పాటిల్

- మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి


కాంగ్రెస్ పార్టీ 420 హామీల పత్రాన్ని చూపిస్తున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం

నిజాంసాగర్(జుక్కల్): బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కష్టంతో రెండు పర్యాయాలు ఎంపీగా గెలిచిన బీబీ పాటిల్ కేంద్రం ప్రభుత్వం నుంచి రైల్వే లైన్ తీసుకురాలేకపోయాడని, ఆయన ఓ అసమర్థుడని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం జుక్కల్ మండల కేంద్రంలోని లక్ష్మీ కల్యాణ మండపంలో జుక్కల్ నియోజకవర్గం, జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ బీబీ పాటిల్‌కు బీఆర్‌ఎస్ టికెట్ ఇప్పించి, అధిక మెజార్టీతో గెలిపించినా నమ్మక ద్రోహం చేశారని విమర్శించారు.

మాజీ ఎమ్మెల్యే సింధే భావోద్వేగం

అసెంబ్లీ ఎన్నికల్లో ఎంపీ బీబీ పాటిల్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు నమ్మక ద్రోహం చేయడం వల్లే తాను ఓడిపోయాయని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే భావోద్వేగానికి గురయ్యారు. తన ఓటమికి వారే కారణమంటూ రోదిస్తూ పేర్కొన్నారు. సమావేశంలో జహీరాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్, జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు ఉన్నారు.

ఆ వార్తలపై పోచారం స్పందించరెందుకు?


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బాన్సువాడ : బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్న పోచారం ఎందుకు స్పందించడం లేదని కాంగ్రెస్ నాయకులు కిషోర్ యాదవ్, పాత బాలకృష్ణలు ప్రశ్నించారు. మంగళవారం బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద వారు మాట్లాడారు. నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌పై ఇలాగే సోషల్ మీడియాలో వార్తలు వస్తే ఆయన ఖండించారని, కానీ పోచారం ఎందుకు స్పందించడం లేదని అన్నారు. గతంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ కార్యకర్తలపై ఆయన అక్రమ కేసులు పెట్టించారని ఆరోపించారు. నాయకులు మంత్రి గణేష్, ఉద్దెర హన్మండ్లు, గాదం సత్యనారాయణ, వెంకట్‌రాంరెడ్డి, తదితరులున్నారు.

క్లుప్తంగా

రసవత్తరంగా కుస్తీ పోటీలు



లింగంపేట(ఎల్లారెడ్డి): కొండాపూర్‌లో మంగళవారం కుస్తీ పోటీలు ఆద్యంతం రసవత్తరంగా సాగాయి. కుస్తీ పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు నిర్వాహకులు అందజేశారు. ప్రతి ఏటా హోలీ పండుగ సందర్భంగా శివాలయం, హనుమాన్ మందిరాల్లో ప్రత్యేక పూజలు చేసి కుస్తీ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

సొసైటీ మహాజన సభ



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి సొసైటీలో చైర్మన్ నర్సింలు అధ్యక్షతన మంగళవారం మహాజన సభ నిర్వహించారు. సభలో సొసైటీ లావాదేవీలను కార్యదర్శి విశ్వనాథం చదివి వినిపించారు. గండిమాసానిపేటలో షట్టర్ల నిర్మాణం, లింగారెడ్డిపేట శివారులో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి తీర్మానం చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, డైరెక్టర్లు ఉన్నారు.

'పది' పరీక్షలకు ఇద్దరు గైర్హాజరు

రాజంపేట: రాజంపేట మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు మండల విద్యాధికారి రామస్వామి తెలిపారు. రాజంపేట బాలికల ఉన్నత పాఠశాలలో 244 మంది విద్యార్థులకు 243 మంది విద్యార్థుల పరీక్షలకు హాజరు కాగా కొండాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 149 మంది విద్యార్థులకు 148 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.

వామపక్ష కూటమి విజయంపై సంబురాలు



కామారెడ్డి టౌన్: ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ)లో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో వామపక్ష ఎస్‌ఎఫ్‌ఐ కూటమి విజయం సాధించడం పట్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ముదాం అరుణ్ మాట్లాడుతూ.. వామపక్ష విద్యార్థి సంఘాలను గెలిపించినందుకు జేఎన్‌యూ విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు. బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్, జిల్లా నాయకులు బుల్లెట్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మణికంఠం, సచిన్ యోగి, మోహన్, సంతోష్ తదితరులున్నారు.

ఎయిర్‌టెల్ సర్వీసుల్లో అంతరాయం

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు రామేశ్వర్‌పల్లి, తిప్పాపూర్, లక్ష్మీదేవునిపల్లి, అంతంపల్లి, బస్వాపూర్ గ్రామాల్లో ఎయిర్ టెల్ సర్వీసులు మంగళవారం ఐదు గంటల పాటు మూగబోయాయి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎయిర్‌టెల్ సిమ్ ఫోన్లు పనిచేయలేదు. దీంతో ఎయిర్‌టెల్ ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఫోన్లో సిగ్నల్స్ ఉన్నా పనిచేయకపోవడంతో పలువురు తమ ఫోన్లు చెడిపోయాయేమోనని రిపేర్ సెంటర్ల వద్దకు వెళ్లడం, ఫోన్లను స్విచ్ ఆఫ్ చేసి తిరిగి ఆన్ చేయడం చేశారు. ఎంతకూ ఫోన్లు పనిచేయకపోవడంతో తీవ్ర అసహనానికి గురయ్యారు.

హనుమాన్ ఆలయానికి విరాళం అందజేత



పిట్లం(జుక్కల్): అల్లాపూర్ గ్రామ హనుమాన్ ఆలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన హనుమాన్ సైన్యం ఆధ్వర్యంలో రూ.21 వేల విలువగల జ్యోతి, దీపారాధన, హుండీని ఆలయ నిర్వాహకులకు విరాళంగా అందజేశారు. అంతకు ముందు హనుమాన్ సైన్యం సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో హనుమాన్ సైన్యం అధ్యక్షుడు పర్వయ్య, ఉపాధ్యక్షుడు సాయిసుధీర్, ప్రధాన కార్యదర్శి విట్టల్, కోశాధికారి శంకర్, సభ్యులు సాయిరెడ్డి, సురేందర్ రావు, బాలాజీ రావ్, సాయిరాం, సంతోష్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, కాంతారెడ్డి, హన్మంత్ రెడ్డి, మల్లు గొండ, బషేందర్, పండరిరావు తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీయే లక్ష్యంగా పని చేయాలి


సమావేశమైన కాంగ్రెస్ నాయకులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రాబోయే లోక్‌సభ ఎన్నికలలో నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషిచేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి కోరారు. ఎర్రాపహాడ్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తిప్పారం మోహన్ రెడ్డి, యూత్ అధ్యక్షుడిగా రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కమిటీ సభ్యులు, అనుబంధ కమిటీలను ఎన్నుకున్నారు. బ్రాహ్మణపల్లిలో కూడా గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నాయకులు షౌకత్ అలీ, శ్యాంరావు, తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు వెంటనే చెల్లించండి


సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

బాన్సువాడ: బకాయి పడ్డ వేతనాలు వెంటనే చెల్లించాలని ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు దుబాస్ రాములు మాట్లాడుతూ.. ఏరియా ఆస్పత్రి, ఎంసీహెచ్‌లో పని చేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, వెంటనే బకాయిపడ్డ వేతనాలు చెల్లించాలని, వేతనాలు చెల్లించే వరకు పనులు బంద్ చేయనున్నట్లు తెలిపారు. కార్మికులు కమ్రుద్దీన్, రేణుక, సురేఖ, రాజు, భారతి, తదితరులున్నారు.

ఆర్టీసీ బస్సు, ట్రాక్టర్ ఢీ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం ఆర్టీసీ బస్సు, ట్రాక్టర్ ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. ఎల్లారెడ్డి నుంచి రుద్రారం వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఘటనలో ఎవరికి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం బస్సులోని ప్రయాణికులను స్థానికులు బయటకు తీశారు.

పోలీసుల కవాతు



దోమకొండ: మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున శాంతి భద్రతల్లో భాగంగా కవాతును నిర్వహించినట్లు స్థానిక ఎస్సై గణేష్ తెలిపారు. ప్రజల్లో భయాందోళనలు తొలగించి శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా చూడటానికి ప్రత్యేక పోలీసులతో కవాతు నిర్వహించామన్నారు. శివ రాంమందిర్‌రోడ్, పాత బీబీపేట రోడ్డు, సుభాష్‌చంద్రబోస్ రోడ్డు, మార్కండేయ మందిరం కాలనీల్లో కవాతును నిర్వహించారు. కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావ్, భిక్కనూరు సీఐ సంపత్ కుమార్, బీబీపేట ఎస్సై ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతున్న సంఘాలకు రుణాలు ఇప్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం రవీందర్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామాలలో అర్హతున్న సంఘాలకు రుణాలు ఇప్పించి, ఆ సంఘాలు మరింత ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూడాలని ఐకేపీ ఏపీఎం రవీందర్ అన్నారు. తాడ్వాయి ఐకేపీ కార్యాలయంలో మంగళవారం మండల సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలు సక్రమంగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నెలా 10లోపు చెల్లించిన సంఘాలకు మాత్రమే పావలా వడ్డీ వర్తిస్తుందన్నారు. ఈ సందర్భంగా జీవనోపాదుల కల్పన, ఆర్థిక చేయూత, ఇన్సూరెన్స్, ఉపాధి కల్పనలు, ప్రభుత్వ పథకాలు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ, వడ్డీ రాయితీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు యశోద, సీసీలు, వివిధ గ్రామాల అధ్యక్షులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులో దూకిన మహిళను కాపాడిన రైతులు

నందిపేట: కుటుంబ సమస్యలతో చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించిన మహిళను స్థానిక రైతులు కాపాడారు. కామారెడ్డి జిల్లా లింగాయపల్లికి చెందిన విజయకు భర్త, కూతురు ఉంది. భర్త వేధింపులు తాళలేక నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయలుదేరిన విజయ మంగళవారం నందిపేట రఘునాథ చెరువులో దూకింది. అటుగా వెళ్తున్న రైతులు మచ్చర్ల సాగర్, ఉమ్మడ ట్రాక్టర్ ఊషన్న గమనించి ఆమెను కాపాడారు.

గ్రంథాలయానికి ఫ్యాన్ల అందజేత


ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): సమస్యల వలయంలో.. గ్రంథాలయం అనే శీర్షికన ఈనెల 23న వచ్చిన కథనానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుర్మ సాయిబాబా స్పందించారు. గ్రంథాలయంలో పాఠకులకు ఫ్యాన్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని గ్రహించిన సాయిబాబా తన సొంత డబ్బులతో రెండు ఫ్యాన్లు అందించారు.

పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలి



నిజాంసాగర్(జుక్కల్): జీపీల వారీగా వంద శాతం పన్నుల వసూళ్లపైన ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు దృష్టిసారించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో గంగాధర్ సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పన్నుల వసూళ్లతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. సమావేశంలో ఎంపీవో యాదగిరి, ఏవో అమర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తప్పిన ప్రమాదం


కాటేపల్లి జెడ్పీ హెచ్‌ఎస్ తరగతి గది స్లాబ్


పెచ్చులు ఊడి పడటంతో విరిగిన బెంచీలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): కాటేపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 8వ తరగతి గదిలో స్లాబ్ పెచ్చులూడి కిందపడింది. ఆ సమయంలో ఊడి పడిన ప్రాంతంలో విద్యార్థులు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. వేసవి కాలంలోనే పాఠశాల భవనం స్లాబ్ పెచ్చులు ఊడితే వర్షాకాలంలో పరిస్థితి ఎలా ఉంటుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురువుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ విషయమై చర్యలు తీసుకోవాలన్నారు.

ఆధ్యాత్మికం

30 నుంచి సిద్ధరామేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



భిక్కనూరు: దక్షిణకాశీగా పేరొందిన భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయంలోని స్వామి వారి బ్రహ్మోత్సవాలను ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 3 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ, పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కామారెడ్డి బస్టాండ్ నుంచి ప్రతి గంటకు ఆర్టీసీ బస్సులు ఆలయానికి వస్తాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావల్సిందిగా వారు కోరారు.

మైసమ్మ ఆలయంలో సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారం గ్రామంలో గల కొచ్చరి మైసమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు కొబ్బరి కాయలు కొట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పాపహరేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని పాపహరేశ్వర ఆలయంలో పురోహితులు శ్రీపత్ రావు పంతులు ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపత్ రావు మాట్లాడుతూ.. శిఖర ప్రతిష్టాపనలో భాగంగా గోవుపూజ, అగ్నిప్రతిష్ఠ, తదితర పూజా కార్యక్రమలు నిర్వహించామని చెప్పారు. బుధవారం జరుగబోయే కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సమాచారం..

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీకి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, పెద్దకొడప్‌గల్ గురుకుల పాఠశాల 6వ తరగతిలో బీసీలకు 1, మైనారిటీలకు 2 సీట్లు, 7వ తరగతిలో బీసీలకు 1 సీటు, 9వ తరగతిలో బీసీలకు 2 సీట్లు, ఎస్టీలకు ఒక సీటు ఖాళీగా ఉందని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నళిని మంగళవారం తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 30లోపు దరఖాస్తు చేస్తుకోవడానికి అవకాశం ఉందని, ఏప్రిల్ 21 ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

నేడు ఎల్లారెడ్డిలో 5కే రన్

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో నేడు(బుధవారం) 5కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్డీవో మన్నె ప్రభాకర్ మంగళవారం తెలిపారు. ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే కార్యక్రమంలో భాగంగా 5కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

అడ్లూర్‌ఎల్లారెడ్డిలో పశువులకు టీకాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డిలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పశుగణ సహాయకుడు కిషోర్ తెలిపారు. రైతులు అందుబాటులో ఉండి తమ పశువులకు టీకాలు వేయించాలని కోరారు.

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం

- మాజీ జెడ్పీచైర్మన్ దఫేదార్ రాజు



నిజాంసాగర్(జుక్కల్): దూరప్రాంతాల నుంచి ప్రయాణం చేస్తున్న ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు, అంబలి కేంద్రాలు ఎంతో దోహదపడుతాయని ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు అన్నారు. మంగళవారం మహమ్మద్‌నగర్ బస్టాండ్ ప్రాంతంలో తన తండ్రి దఫేదార్ కిషన్ జ్ఞాపకార్థం అంబలి, చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏటా చలివేంద్రంతో పాటు అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేసి, దాహార్తిని తీరుస్తున్నామన్నారు. గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, బీఆర్‌ఎస్ నాయకులు గంగారెడ్డి, రాంచందర్, దఫేదార్ విజయ్ కుమార్, తదితరులున్నారు.

ఓబీసీ మోర్చ అధ్యక్షుడిగా కటికె రమేశ్



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల ఓబీసీ అధ్యక్షుడిగా సదాశివనగర్‌కు చెందిన కటికె రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు కుంట రాంరెడ్డి, మండల ప్రధానకార్యదర్శి మార రమేశ్‌రెడ్డిలు తెలిపారు. ఓబీసీ మోర్చ ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా చాకలి రమేశ్, దొడ్లె సంగం, మామిడి రమేశ్, శ్రీనివాస్ రావు, జంగం ప్రవీణ్, కార్యదర్శులుగా శేఖర్, రమేశ్, నందురావు, బాలకిషన్, కోశాధికారిగా జోగిని ఎల్లన్న, కార్యవర్గ సభ్యులుగా ఆకుల సాయిలు, సంతోష్, సతీశ్, రాంప్రసాద్, శ్రీకాంత్, ప్రశాంత్‌లను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

తిర్మన్‌పల్లి కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): తిర్మన్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రాగుల రాజ మైసాగౌడ్, ఉపాధ్యక్షుడిగా సాయిలు, కార్యదర్శిగా నితిన్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా ప్రశాంత్, భాస్కర్, సాయిలు, బంతిలాల్, శ్రీనులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

మరమ్మతులు చేపట్టాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని జాతీయ రహదారి–161 పక్కన మిషన్ భగీరథ పైపులైన్ వాల్ లీకేజీకి మరమ్మతులు చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఐదు రోజుల నుంచి మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వాల్ లీకై నీళ్లు వృథాగా పోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వారు తెలిపారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి నీటి సమస్య తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

హోలీ..ఆనంద కేళి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు బ్రహ్మజీవాడి, క్రిష్ణాజీవాడి, బ్రాహ్మణపల్లి గ్రామాలలో మంగళవారం హోలీ వేడుకలు జరుపుకున్నారు. యువకులు, మహిళలు చిన్న, పెద్ద తేడా లేకుండా ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సహాల మధ్య హోలీ పండుగను చేసుకున్నారు. సోమవారం రాత్రి పశువుల పేడతో తయారు చేసిన పిడుకలను ఒకే దగ్గర పేర్చి కామ దహనం చేశారు.

లింగంపేట పట్టణ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట పట్టణ కాంగ్రెస్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా ప్రసాద్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా నవీద్, ప్రధాన కార్యదర్శిగా తిరుమల కిరణ్, సహాయ కార్యదర్శులుగా శ్రవణ్ కుమార్, కుమ్మరి సాయిలు, కోశాధికారిగా భాస్కర్‌గౌడ్, కార్యవర్గ సభ్యులుగా అద్నాన్, నర్వ వినోద్, కుమ్మరి శేఖర్, జీవన్, ముదాం స్వామి, నాజు, రవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే పట్టణ యూత్ అధ్యక్షుడిగా అబ్దుల్ ఖయ్యూమ్, ఉపాధ్యక్షుడిగా అద్నాన్, ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్, సహాయ కార్యదర్శులుగా విష్ణు, సాయిలు, కార్యవర్గ సభ్యులుగా సందీప్, శశాంక్, సాయికుమార్, మజీద్, నదీమ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుర్రనారాగౌడ్, సుప్పాల రాజు, నగేష్, జొన్నల రాజు, కొడ రవి, బైరయ్య, తదితరులు పాల్గొన్నారు.